

# ఎందుకే నీకింత తొందరా...

## – బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (ప్రారంభం)

"పేరు?"

"రుష్యేంద్రమణి"

వరుసగా కొన్ని తలలు నావైపు తిరిగి చూసాయి. నాకు అలవాటే. మా అమ్మమ్మ తన కాలం నటిమీద అభిమానంతో ఈ పేరు పెట్టిందట. ఆవిడ తరువాత ఎవరూ ఈ పేరు పెట్టుకోకపోవడం నాకు ఆశ్చర్యం వేస్తుంది. కొంచెం చిరాకు కూడా వేస్తుంది. అందరూ నా పేరు చెప్పినప్పుడల్లా ఇలా చూడ్డం.

మా తెలుగు పండిట్ సీతారామ శాస్త్రిగారు "ఋ" అది రుష్యేంద్రమణి కాదు. ఋష్యేంద్రమణి అని బ్లాక్ బోర్డ్ మీద రాసి చూపించి చెప్పేవారు. ఆ 'ఋ' ఇప్పుడు లేదు. అక్షరమాలలోనే లేదు. నా పేరులో మొదటి అక్షరంలా నా లైఫ్ ఎంతో నిరర్థకం అయిపోయినట్లు నాకు అనిపిస్తోంది. మనిషి జీవితం, మన పూర్వీకులు చెప్పినట్లు వందేళ్ళు కాదు, ఇప్పటి రోజుల్లో యాభై.. కాదులే.. అరవై అనుకుంటే, నేను అందులో సగం నిరర్థకంగా గడిపేసాను.

జబ్బమీద నెప్పి. ఒక్క సెకన్, నాకు నర్స్ బూస్టర్ షాట్ ఇచ్చింది. ఆ ప్లేస్‌లో మెత్తని దూది అద్ది, ఒక్క ప్లాస్టర్ వేసింది. నేను థాంక్స్‌లో సగం చెప్తుండగానే "నెక్స్ట్" అంది. ఆ అమ్మాయికి పాతికలోపే వుండచ్చు. కానీ ఇప్పటికే చాలా విసిగి వేసారిపోయినట్లు, మొనాటనస్ వాయిస్‌తో, రొటీన్‌గా పనిచేస్తూ ఏదో పోగొట్టుకున్నట్లుగా వుంది.

ఏదో కాదు, నవ్వు పోగొట్టుకున్నట్లుగా వుంది. నేను నా కుర్తీ స్లీవ్ కిందకి చేసుకునికూడా ఇంకా లేవకపోవడంతో నా వైపు విసుగ్గా కూడా కాదు నిస్తేజంగా చూసింది.

నేను నవ్వాను. స్నేహపూర్వకంగా నవ్వి "గుడ్ షాట్.. అసలు చీమ కుట్టినట్లు కూడా అనిపించలేదు నాకు" అన్నాను.

ఆమె తల వూపింది. నుదుటి మీద వున్న మూడు గీతల్లో, రెండు క్లియర్ అయి, ప్రశాంతంగా చూసింది."మీ పేరు కూడా బావుంది" ఆమె ఎడమ చేతివైపు పెట్టుకున్న నేమ్ బేడ్జ్ చూసి చెప్పాను. ఆమె పేరు 'జాస్మీన్'. ఆమె పెదవులు బద్ధకంగా విడివడి, అలవాటు లేని పనిచేస్తున్నట్లు చిన్నగా నవ్వి 'థాంక్స్' అన్నాయి. నాకెంతో సంతోషంగా అనిపించింది. 'ఎస్' ఆమె మొహంలో నవ్వు చూసాను. అది ఎంతో బావుంది. ఓ చిన్న అప్రిసియేషన్, చిన్న మెప్పుకోలు. ఇంతగా మనిషిని స్పందింప చేస్తాయా?

'మీ పేరు బావుంది ' అన్నాను.

ఈ ప్రశంసలో నేను పొగిడిన భాగం ఆమెకిగానీ ఆమె ప్రతిభకానీ సంబంధించినవి కావు. 'రుష్యేంద్రమణి' అనగానే ఎంత పాత చింతకాయ పచ్చడి పేరూ అని నా వైపు అందరూ తిరిగి చూస్తే, 'ఆ బోర్ నాకు సంబంధించినది కాదు, మా అమ్మమ్మ టేస్ట్. ఆవిడ మాట విన్న మా అమ్మ తప్పు నాది కాదు' అని ఎలుగెత్తి చెప్పాలనిపిస్తుంది.

చాలాసార్లు నా పేరు మాత్రం విని, ఏ పట్టు చీరలోనో, సంప్రదాయబద్ధంగా వచ్చే స్త్రీ మూర్తి కోసం ఎదురు చూసేవాళ్ళు, టోర్న్ జీన్స్‌లో, నిర్లక్ష్యంగా జుట్టు ముడేసి, దానిమీద పెద్ద దువ్వెనంత బనానా క్లిప్ పెట్టి ఆ జుట్టుని భుజాల మీదకి వదిలేసి వెళ్ళే నన్ను ఆశాభంగంగా చూస్తారు. జనం ఎప్పుడూ ఇంతే. వాళ్ళు మనగురించి ఏదో ఎక్స్‌పెక్ట్ చేసి, ఏదో ఊహించుకుంటారు. మనం అలా లేకపోయినా, అలా ప్రవర్తించకపోయినా ఆశాభంగం చెందుతారు. ఆశ.. ఇది మనం పడమన్నామా? ఇంజనీరింగ్ కాలేజ్‌లో మా జూనియర్ పేరు సిల్వస్టర్ స్టాలిన్. వాడూ బక్క చిక్కి, గాలొస్తే ఓ పక్కకి పడిపోయేట్టు వుండేవాడు. అందరూ 'సిల్వెస్టర్ స్టాలిన్' ఇలారా నీ రాకీ ఫైట్ చూపించు" అంటూ వుంటే సిగ్గుతో ఇంకా భూమిలోకి ఒంగిపోయేవాడు.

సీరియస్లీ ఆ పేరు అతను పెట్టుకున్నాడా? లేదు కదా! ఆ పేరు పెట్టిన అతని తల్లితండ్రులు హాయిగా ఏ జేమ్స్ బాండ్ మూవీనో ఓటీటోలో చూస్తూ, టీ తాగుతుంటే, పాపం ఇతన్ని అందరూ టీజ్ చెయ్యడం. తప్పు ఒకళ్ళదీ శిక్ష ఒకళ్ళకీ అనిపించేది నాకు.

"మీ అమ్మాయి ఏం చేస్తోంది?"

"ఇంజనీరింగ్.. కానీ" అని నీళ్ళు నమిలేది అమ్మ. నేను ఇంట్లో వుంటే, వెంటనే బయటకి వచ్చి "నాకు ఇంజనీరింగ్ బోర్ కొట్టింది. మానేసాను. చదువు మానెయ్యలేదు. ఇంజనీరింగ్ మానేసాను. హిస్టరీ చదవాలనిపించింది. బి.ఏలో చేరాను. రేపు ఎం.ఏ కూడా చేస్తాను, హిస్టరీ టీచ్ చేస్తాను. ఏం తప్పా? అసలు హిస్టరీ సబ్జెక్ట్ కాదా? చదువంటే ఇంజనీరింగ్, లేకపోతే మెడిసెన్ ఏనా?" అనాలనిపించేది.

ఇంజనీరింగ్ నేను డిస్‌కంటిన్యూ చేసాక అమ్మ తన ఫ్రెండ్స్‌ని కలవడం, కిట్టీ పార్టీలు ఎరేంజ్ చెయ్యడం మానేసింది. "రుషి మా ఒక్కగానొక్క అమ్మాయి, దానికి చదువు మీద ఇంట్రెస్ట్ లేకపోతే వెంటనే పెళ్ళి చేసేస్తాం" అని నా కెరీరే కాదు. నా లైఫ్ డిసైడ్ చేసెయ్యడం మొదలుపెట్టారు.

"గోపాల్ బావకి నిన్ను చేసుకుంటాను అని మీ అత్తయ్య అడుగుతోంది" అంది అమ్మ.

కందిపొడి మీద పప్పు నూనె వేసుకోవాలా? నెయ్యి వేసుకోవాలా? అని కంఫ్యూజన్‌లో వున్న నేను "గోపాలం బావకి పాపం పెళ్ళాం పోయిందా?" అన్నాను.

అన్నం తింటున్న నాన్నా, అమ్మా, బామ్మా అంతా వులిక్కిపడ్డారు.

"వాడికి పెళ్ళాం ఏవిటే? ఇంకా పట్టుమని పాతికేళ్ళు అయినా లేవు, చక్కగా బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసుకుంటున్నాడు. అత్తయ్య అంటే మీ నాన్న కజిన్ ప్రభావతి అత్తయ్య, బోలెడు ఆస్తి, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్‌లో పెద్ద ఆఫీసర్‌గా రిటైర్ అయ్యారు మీ మావయ్య" అంది అమ్మ.

"గోపాల్ అనే పేరూ, సడెన్‌గా సీన్‌లోకి వచ్చే పెళ్ళి సంబంధాలూ, పాత సినిమాల్లో ఇలా భార్యపోయి నాగేశ్వరరావులా, ఓ ఏడాది పాపతో 'ఆడేపాడే పసిపాప' అన్నట్లుగా సడెన్‌గా వచ్చే పాత్రలు. నీతో కలిసి రాత్రుళ్ళు 'ఈటీవీ' సినిమాలో పాత సినిమాలు చూసిన అనుభవం నాది" అని, కందిపొడిలో చారు వేసేసుకున్నాను.

"అదేవిటే?" అంది బామ్మ కొంచెం కోపంగా.

"ఏం కందిపొడిలో చారు వేసుకోకూడదా? అలా అని ఏ బుక్‌లో వుంది?" అన్నాను.

"అదికాదు, వాడిని పెళ్ళాం పోయిన నాగేశ్వరరావుతో పోలుస్తేనూ?" అంది బామ్మ కోపంగా.

"శరత్‌బాబుతో కూడా పోల్చచ్చు. అభినందనలో పాటలు బావుంటాయి, 'చుక్కలాంటి అమ్మాయీ, చక్కనైన అబ్బాయీ.." అని పాడాను.

"ఇది సీరియస్ మేటర్ అమ్మూ" అన్నారు నాన్న.

'అమ్మూ' అంటే నేను ఎలర్ట్ అవ్వాలనమాట.

"నాన్నా నేను సీరియస్‌గా తీసుకోడానికి అందులో ఏవుంది? నేను ఇంజనీరింగ్ డిస్క్, కాబట్టి నన్ను అర్జెంటుగా ఎవరికో ఒకరికి కట్టబెట్టి, వదిలించుకోవాలి అనుకుంటున్నారు. నేను చదివే 'ఆర్ట్స్' లో డిగ్రీకి ఏమీ విలువలేదు మీ దృష్టిలో.

అసలు ఈ పెళ్ళి చేసుకోబోయే గోపాల్‌కీ నాకూ ఏ సంబంధం లేకుండా, ప్రభావతి అత్తయ్య నిన్ను గోపాల్‌కి ఇచ్చి చేసుకోవాలి అనుకుంటోంది అన్నావ్. అక్కడే అది నాకు జోక్‌గా అనిపించింది. ఆవిడెవరు ఇద్దరు గ్రోన్ అప్ పిల్లల గురించి డెసిషన్స్ తీసుకోడానికీ. అదీ పెళ్ళి మేటర్‌లో. మమ్మీ నీకు ఏమీ తోచకపోతే, నా చదువు వల్ల సమాజం ముందు తలెత్తుకు తిరగలేక నువ్వు 'కిట్టీలు' మానేసినందుకు, 'ఏ 'యూ ట్యూబ్' ఛానెలో పెట్టుకుని, పిల్లలకి 'ఉగ్గు' ఎలా పొయ్యాలీ? దిష్టి ఎలా తియ్యాలీ? చెప్పు. చాలామంది చూసి లైక్‌లు కొడ్తారు .నీకు టైం పాస్ అవుతుంది" అని లేచి చెయ్యి కడుక్కునాను.

ఆ గోపాల్ మీద నాకు దురభిప్రాయం లేదు. అసలు కరెక్ట్‌గా ఎవరో ఏంటో కూడా తెలీదు. కానీ పిల్లల పెళ్ళిళ్ళు పెద్దవాళ్ళు కుదర్చడం ఏవిటీ? 20వ శతాబ్దంలో. నా పేరు రుష్యేంద్రమణి కానీ నేను 18వ శతాబ్దంలో పుట్టలేదుగా.

నేను ఏలియన్‌లా కనిపిస్తాను అమ్మకీ నాన్నకీ. అమ్మ పెద్దమ్మతో ఫోన్‌లో మాట్లాడ్తోంది "ఏమిటో ఇది ఇలా తయ్యారయింది. చదువు మానేసి బి.ఏ, ఆ తర్వాత ఎం.ఏ అతర్వాత పి.హెచ్.డి చేసి డాక్టరేట్ తీసుకుంటుందిట. ఏ వయసుకి ఆ ముచ్చట అన్నారు. అవతల పక్కన పెద్దమ్మ, చెల్లెల్ని ఓదారుస్తూ మాట్లాడ్తున్నట్లు వుంది. ఇవతలి పక్కన వసుంధర, అంటే అమ్మ కళ్ళు తుడుచుకుంటూ" అవునక్కా, ఏదో మనం పెద్దవాళ్ళు చెప్పినట్లు విని, ఆ మూడుముళ్ళూ వేయించుకుని, పిల్లల్ని కని సంసారాలు సరిదిద్దుకున్నాం కానీ ఇప్పటి జెనరేషన్‌ని చూస్తే జాలేస్తోంది. చాలా కన్‌ఫ్యూజ్‌డ్ జెనరేషన్. ఏం చెయ్యాలో తెలీక కష్టపడ్తున్నారు. ఫ్రస్టేషన్‌లో బి.పిలు, షుగర్లు చిన్న వయసులోనే."

"సీరియస్లీ?" నా గొంతు అంత గట్టిగా విని అమ్మ అదిరిపడి చూసింది.

"మీరు పెద్దవాళ్ళు చెప్పినట్లు పెళ్ళి చేసేసుకుని హేపీగా వున్నారా? పెద్దమ్మ ఇంటర్‌మీడియెట్‌లో క్లాస్ ఫస్ట్ వచ్చింది. బలవంతంగా చదువు మానిపించి, మీ అమ్మమ్మకి కాన్సర్, పోతారేమో అని పుల్లయ్య పెద్దనాన్నతో పెళ్ళి జరిపించారు శెలవల్లో, తను చాలా ఏడ్చింది అని చెప్పావు. గుర్తుందా?

ప్రియంవద పెద్దమ్మ పేరు ఎంత బావుంది? ఫూలిష్‌గా ఎవడ్నో నమ్మి మోసమోయిన శకంతల పేరు కాకుండా, అభిజ్ఞాన శాకుంతలంలో నుండి ఇంత అందమైన పేరు తీసుకుని పెట్టారే మీ అమ్మా నాన్నలు? 'పుల్లయ్యకిచ్చి ప్రియంవదను' అని శుభలేఖలో చూసి పెద్దమ్మ ఎంత ఏడ్చి వుంటుందో చెప్పమను. పుట్ హర్ ఆన్ స్పీకర్. పెద్దమ్మా 22 ఏళ్ళకల్లా ఏటేటా ఒకళ్ళ చొప్పున ముగ్గుర్ని కన్న నువ్వు ఎంత బలహీనపడ్డావో, పాతిక కల్లా ఎంత వెయిట్ గెయిన్ చేసావో, ఆయాసం, ఉబ్బసం, ఎనీమియాతో ఎన్ని మాత్రలు మింగావో. మీరిద్దరూ చెప్తున్నారా మా జెనరేషన్ కంప్యూజ్డ్ అనీ, మా ఆరోగ్యాలు మేం పాడూ చేసుకుంటున్నాం అనీ. మీ చెల్లెలు అంటే మా అమ్మ ఎంత బాగా వీణ వాయించేదీ, ఏవైంది పెళ్ళి అయ్యాక. శ్రీ శ్రీ శ్రీ పతిదేవులు క్రిష్ణారావుగారి కోసం ఆయనకి ఇష్టం వుండదని. ప్రోగ్రామ్స్ మానేసి, గోంగూరా, చింతకాయ పచ్చడిలలో తన ప్రావీణ్యం చూపి, ఆయన 'అద్భుతంగా చేసావు' అంటే మురిసిపోయి, దేవుడి దగ్గర తప్ప పాట పాడడానికి కూడా జంకింది. ఏం చదవాలో, ఏం అభిరుచులు ఏర్పరుచుకోవాలో ఎప్పుడు పెళ్ళి చేసుకోవాలో ఎప్పుడు పిల్లల్ని కనాలో మీ చేతిలో లేకుండా, ఎవడో ముక్కూ మొహం తెలీని వాడి చేతిలో మీ 'జీవితపు గాలిపటపు, దారం కొస' పెట్టి మీరు నిశ్చింతగా వున్నారా?... ఓహ్"

ఒక్క నిమిషం ఆగి నేనన్న మాటకి ఆశ్చర్యపోయి "మే.. బీ నాలో రైటర్ వుంది. అందుకే ఇంతమంచి సెంటెన్స్ ఫార్మ్ చేసాను. నోట్ ఇట్ వసుంధరా! జీవితపు గాలిపటం కొస ఎవరి చేతిలోనో పెట్టి ఇది ఆనందం.. ఇదే అమ్మాయిల ఆనంద జీవితానికి రూట్ అని మీకు మీరు అనేసుకుని, చంకలు గుద్దేసుకుంటున్నారా? మరి డాడ్ నిన్ను ఒక వ్యక్తిత్వం లేని బొమ్మలా చూస్తున్నాడు. మొన్నా మధ్య ప్రభావతి అత్తయ్యా వాళ్ళ ఇంట్లో తద్దినానికి రానన్నావు అని 'ఒక పేద కడలా

కార్‌లో పడి వుండడమేగా' ఎందుకు రావు? అన్నారని ఇదే పెద్దమ్మతో చెప్పుకుని ఏడ్చావుగా? చెప్పు. ఇదేనా పందులాంటి కాపురం. లక్షణంగా వుండడం? ఎన్నిసార్లు నువ్వు ఒక నెలలో కళ్ళనీళ్ళు పెట్టుకుని ఎంచక్కా పాటలు పాడుతూ లతా మంగేష్కర్ అయ్యేదాన్ని, ఇక్కడ వంటింట్లో గ్రైండర్ అయ్యానని ఏడవలేదు?" అని నిలదీసాను.

"నాకు పనుందే మళ్ళీ మాట్లాడ్తాను. ఈ పిల్లలతో మాట్లాడలేము" అని ప్రియంవద పెద్దమ్మ ఫోన్ పెట్టేసింది.

వసుంధర నా వైపు కోపంగా చూసి "పెద్దా, చిన్నా లేదూ? పెద్దమ్మని ఎంత బాధపెట్టావో?" అంది.

"ఏవైనా తిట్టానా? లేని మాటలు అన్నానా?" అడిగాను.

అమ్మ గొణుగుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది. 'వెధవ పోలికలు మీ నాన్న వైపువి వచ్చాయి. ఆ అబ్బాయికి పిచ్చి మేనమామ వున్నాడుట. పెళ్ళి అయ్యేదాకా దాచారు జాగ్రత్త' అని మా అమ్మ చెప్తూనే వుంది" అంటూ.

నాన్న మేనమామ 'పిచ్చి'నాకు అంటిందని సర్టిఫికెట్ ఇచ్చేసి "ఇది మల్లెల వేళయనీ, ఇది మల్లెల మాసమనీ" అని పాడుకుంటూ, పిండి గ్రైండర్‌లో వేసే అమ్మకి, తను నన్ను అన్నమాటకన్నా, నేను పెద్దమ్మని అన్నమాట పెద్దదేం కాదు అని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యదు. వాళ్ళు "మేం రైట్. పద్ధతిగా పెరిగాం. కరెక్ట్‌గా చేసాం" అనే కండీషనింగ్ చెయ్యబడ్డారు.

నేను సిస్టం ఆన్ చేస్తే, ఫ్రెండ్ యాషిక దగ్గర నుండి ఈ మెయిల్ వచ్చింది, 'యాషిక' ఫోటోగ్రఫీ మీద అభిరుచితో వాళ్ళ నాన్న పెట్టిన పేరు. అది ఎంత ఆట ఆడబడిందో ఆ పేరు వల్ల కాలేజ్‌లో నా పేరు 'నికాన్' నన్ను పెళ్ళి చేసుకుంటారా? ఇద్దరం మంచి ఫోటో ఫ్రేమ్ లో సెట్ అవుతాం" అని ఓ ఆకతాయి అబ్బాయి అంటే నాతో ఏడ్చింది' ఇంకేం పేర్లు దొరకలేదా వీళ్ళకి?' అని.

అసలు ఎవరికీ లేని, పేర్లు మన పిల్లలకి వుండాలి అనేదే పెద్దవాళ్ళకున్న పెద్ద జాడ్యం.

ఈ మెయిల్ ఓపెన్ చేస్తే యాషికా బోలెడు లవ్ సింబల్స్, గ్రేట్ అన్న స్మైలీస్ పెట్టి, చప్పట్లు కొడ్తున్న చేతులతో మూడు లైన్స్ నింపాక నిరర్ధకంగా అసలు మేటర్ రాసింది. నీ లెటర్ చదవగానే, నువ్వు మంచి రైటర్‌వి అవుతావు అని నాకు అనిపించింది. ఇట్స్ ఎక్సలెంట్. నువ్వు నిన్న కాఫీ కప్‌లో నిన్ను కలసిన సాత్విక్ హావభావాలని వర్ణించిన తీరు. శేఖర్ కమ్ముల సినిమాలోలా అనిపించింది. 'ఆ రెస్టారెంట్ గ్లూమీనెస్, అతని మొహంలో బుగ్గ మీద సొట్ట, అమ్మమ్మ ఇచ్చిన వెండి కంచం సొట్టలా వుందనడం రియల్లీ హేట్స్ ఆఫ్.. నువ్వు సీరియస్‌గా రైటింగ్స్ మొదలుపెట్టు. మన జెనరేషన్‌లో తెలుగులో సెన్సిబుల్‌గా 'న్యూవేవ్' రైటింగ్స్ చేసే విమెన్ రైటర్ససలు లేరు రిషీ.. "అంటూ బోలెడు పొడుగు రాసింది.

ఎంతైనా మనకి ఇంటర్ మీడియెట్ గ్యాంగ్‌తో ఎక్కువ క్లోజ్‌నెస్, ప్రేమా వుంటాయి.. ఎందుకంటే ఇంటర్‌మీడియెట్ చదివేటప్పుడు ఫూలిష్ ఏజ్‌లో వుంటాం. అన్నీ అర్థం అయ్యాయి అనుకుని, రోజూ కాలేజ్‌కి వెళ్ళేటప్పుడు బస్ స్టాప్‌లో నిలబడి సిగరెట్ తాగే అన్ నోన్ అబ్బాయి, మొహం మీద పడే జుట్టు రింగ్‌ని చూసి కూడా గాఢంగా

ప్రేమిస్తాం. అతన్ని ఎవరో 'వినూ' అని పిలిస్తే 'వినూ ఐ లవ్ యూ' అని కెమిస్ట్రీ బుక్‌లో రాసుకుని, క్లోజ్ ఫ్రెండ్‌తో అది షేర్ చేసుకుని దానికి బస్ స్టాప్‌లో అతన్ని చూపించి, రహస్యంగా పెద్ద స్క్రీన్ ప్లే రాసుకుని హృదయంలో, స్లీప్ ఓవర్‌కి వెళ్ళి, ఓ దుప్పటిలో దూరి, దానితో గుసగుసలాడి, నాకూ ఓ ప్రేమకథ వుంది అని గర్వంగా, రిలీఫ్‌గా ఫీల్ అవుతాం.

తర్వాత కొన్నాళ్ళకి అతను ఇంకో అమ్మాయితో బైక్ మీద కనిపిస్తే ఆ అమ్మాయి మనకన్నా అందంగా వుండి, అతని మీదకి వాలి, 70 ' లలో హీరోయిన్‌లా అతని చెవి తమ్మె కొరుకుతుంటే, (వాట్ ఎ బాడ్ టేస్ట్') మన గుండె చిధ్రమై భగ్న ప్రేమికుల్లా మళ్ళీ స్లీప్ ఓవర్. దుప్పట్లో ఏడుపులూ. ఉండాలి అలాంటి ఫూలిష్ ఫ్రెండ్స్ ఒకళ్ళిద్దరు. వాళ్ళకి లైఫ్‌లో ఏ స్టేజ్‌లోనూ ఫూలిష్‌గా కనిపించం. ఎందుకంటే మన వేవ్‌లెంత్ ఫస్ట్ డే కాలేజ్‌లో కలవగానే మేచ్ అయిపోతాయి కాబట్టి. వాళ్ళనే ఒసేయ్. ఏమే అంటాం. ఇప్పుడు కలవగానే కాఫీ కప్‌లో అబ్బాయిలని 'ఏరా' 'రా' అనడం ఫ్యాషన్ అయిపోయింది కానీ, నాకు అలా అనాలి అంటే చాలా దగ్గరతనం అవసరం.

నేను యాషికాని సీరియస్‌గా తీసుకుంటాను. నౌ ఐ రియలైజ్‌డ్ మై పాత్. సీరియస్లీ నేను రైటర్ అయితేబావుంటుంది. ఇందాకే ఒక అద్భుత వాక్యమన్నాను వసుంధరతో. బట్ తనకి అంత లిటరరీ సెన్స్ లేదు. గొణుక్కుంది అనుకో.

పైగా తను ఉత్సాహంగా 'గోపాల్ బావకి నిన్ను చేసుకుంటానంది ప్రభావతి అత్తయ్య' అన్నప్పుడు అఫెండింగ్‌గా మాట్లాడాను అని కోపంగా వుంది కూడానూ, అంటూ యష్‌కి నా 'గోపాలం బావ  ఎపిసోడ్ అంతా రాసి, నేనూ ఓ మొహంకొట్టుకుంటున్న అమ్మాయి స్మైలీతో.. లవ్ ఫ్రం రిషి  అని పంపేసాను.

తర్వాత వాట్సప్ తీసి "డూడ్ హాయిగా ఫోన్ చేసుకోవచ్చుగా మనం. ఈ మెయిల్ ఎందుకు పంపావు?" అని మెసేజ్ చేసాను.

"నీ దీర్ఘమైన లెటర్స్ చదవడం నాకిష్టం" అని రిప్లై వచ్చింది. 'పైగా ఆఫీస్‌లో వున్నాను' అని రెండో వాక్యం వచ్చింది.

ఉత్తరం అందుకున్న ఆనందం నిజంగానే వేరే. మేం ఇంటర్‌మీడియెట్‌లో అది సమ్మర్ హాలిడేస్‌కి వాళ్ళ మేనమామ ఇంటికి ఢిల్లీ వెళ్ళి నెలరోజులు వుంటే కూడా ఉత్తరాలు రాసుకున్నాం. తర్వాత సెల్‌ఫోన్ కొనిచ్చారు ఇంట్లో. అదీ ఎంత రచ్చో. కొనడానికి వీల్లేదు. ఎం.సెట్‌లో ర్యాంక్ వచ్చి ఫ్రీ సీట్ వచ్చేదాకా" అని వసుంధర ఎంత గొడవ చేసిందో. పాపం కొన్నిసార్లు డాడ్ బెటర్. "లోకంతో బాటు మనమూ వుండాలి వసూ" అంటూ ఫోన్ కొనిచ్చారు.

నా ఫోన్ రింగ్ అయింది. హనీష్ ఫోన్ చేస్తున్నాడు. వాడు నా తమ్ముడు, వాడిని 'హనీ' అని పిలుచుకోడానికి హనీష్ అని పేరు పెట్టారు. నాకేమో రుష్యేంద్రమణి. వాడు ఎం.ఎస్ చెయ్యడానికి యూ.ఎస్ వెళ్ళాడు.

"ఏంట్రా?" అన్నాను నిర్లక్ష్యంగా.

"దీప్తికి నా అల్మారాలో వున్న బ్లాక్ వాటర్ బుక్ ఇవ్వు. సాయంత్రం వస్తుందిట" అన్నాడు.

టైం చూసా. అప్పుడు అమెరికాలో వాడున్న స్టేట్‌లో రాత్రి రెండు అవుతోంది. "ఇప్పటిదాకా దీప్తితో మాట్లాడావా? టైముకి నిద్రపోవా? " నాటోన్‌లో అక్కరికం సడెన్‌గా తీవ్రంగా పలికింది.

"చాల్లేవే మమ్మీలా మాట్లాడకు. జస్ట్ గివ్ ఇట్" అన్నాడు విసురుగా.

"రేయ్.. అనుభవంతో చెప్తున్నాను. ఇంజనీరింగ్ చదివేటప్పుడూ లవ్‌లు నిలవవు. అదీ రేపు ఎం.ఎస్.కి వెళ్ళి నీకు బిస్కెట్ ఇస్తుంది. ఎందుకంటే, పరాయి దేశం వెళ్ళి కొత్త మనుషులని చూసాక అమ్మాయిలకి మెదడు వికసిస్తుంది" అన్నాను.

"జస్ట్ గివ్ హర్ దట్ బుక్" అని కోపంగా ఫోన్ పెట్టేసాడు. ఆరేళ్ళు చిన్నవాడు అంత పొగరు. ఎన్ని ఏళ్ళు చిన్నవాడైతే పొగరుండొచ్చు అని ఆలోచించి, పరవాలేదు తమ్ముడేగా అని తల విదిలించేసా. ఇప్పుడు నాముందున్న ప్రోబ్లం ఉద్యోగం. నేను ఆర్థికంగా స్థిరపడాలి. లేదంటే ఇంట్లో అసలు గౌరవం వుండట్లేదు అని నెట్‌లో చూడడం మొదలుపెట్టాను. బి.ఏ డిగ్రీకి పక్కన బి.ఎడ్ లేకపోతే టీచర్ ఉద్యోగం కూడా రాదు అని బామ్మ అంటూ వుంటుంది. బామ్మ ఓల్డ్ మెట్రిక్యులేటే కాదు. ప్రభుత్వ ఉద్యోగం కూడా చేసింది. ఆవిడంటే నాకు చాలా గౌరవం.

కొన్ని పనికిమాలిన ఉద్యోగాలు ఇంటినుండే చెయ్యచ్చు అన్నవాటికి అప్లై చేసి, వెనక్కి వాలి ఒళ్ళు విరుచుకున్నాను. ఉద్యోగం నాకు మొదటిసారికాదు. నేను ఇరవైరెండో ఏటనుండి చాలా ఉద్యోగాలు చేసాను. అయితే అలా చిన్న చిన్న ఉద్యోగాలు చేసేటప్పుడు దాన్ని కెరియర్ అనరు.

"ఏమిటి నువ్వు హాస్పిటల్‌లో ప్యూన్ పని చేస్తావా?" ఇది అమ్మ రియాక్షన్. నేను నా మొదటి ఉద్యోగం సంపాదించినప్పుడు.

"అది ప్యూన్ పనికాదు. రిసెప్షనిస్ట్."

"రోగంతో వచ్చినవాడికి రిసెప్షన్ ఏవిటీ?" బామ్మ ఆశ్చర్యం.

"బామ్మా! వారి కేసు వివరాలు తీసుకుని, డాక్టర్ దగ్గర ఎపాయింట్‌మెంట్ ఇప్పించి లోపలికి పంపడం"

"కోర్టులో ప్యూనేగా పేరు పిలిచి లోపలికి పంపిస్తాడూ?" ఆవిడ మళ్ళీ అంది.

ఆవిడ తండ్రి మెజిస్ట్రేట్, తాత తహసిల్దార్ చేసారుట. పెద్దనాన్న పచారీ షాప్ పెట్టుకున్నాడు. బాబాయ్ పాపం పనిలేక నానాఅవస్థలూ పడ్డాడు. పెళ్ళాం వంటలు చేసి సంపాదిస్తుంటే కుర్చుని తినడం. ఈ చివరి ఉపమానం మాత్రం చెప్పదు. మొదట రెండూ గొప్పగా చెప్పుకుంటుంది. కానీ మా యింట్లో నేను చేసే తుక్కు పనులే హైలైట్ అవుతాయి. సింగింగ్‌లో చాలా కప్పులు తెచ్చుకున్నాను. నా కథలూ పొయిట్రీ కాలేజ్ మేగ్‌జైన్స్‌లో పడ్డాయి. అవి చెప్పరు ఎవరికీ? ఇది చదువు మానేసింది ఇంజనీరింగ్... బి.ఏలో చేరిందన్నది వాళ్ళకి అనవసరం. ఎకనామిక్స్‌లో క్లాస్‌లో హయ్యెస్ట్ స్కోర్ చేసాను. అదీ వాళ్ళకో విశేషం కాదు. పక్కింటి వాళ్ళ అమ్మాయి ఉద్యోగం వచ్చి అమెరికా వెళ్ళింది. అమ్మకి వంటగదిలో ఇన్ స్టాపాట్, అమ్మమ్మకి గ్లూకోమీటర్, నాన్నకి బి.పి ఆపరేటస్, తమ్ముడికి లాప్‌టాపో, ఏదో తెచ్చింది. అమ్మాయి అంటే

అలా వుండాలి. నాలా ఆస్పత్రిలో పేర్లు పిలుస్తూ, తలుపు ఇవతల నిలబడికాదు. ఎప్పుడూ తలుపు తీసుకుని లోపలికి వెళ్తే లోపల వుండాలి. రూల్ నెంబర్ వన్ ఇది.

"డాక్టర్ ప్రబంధ్" ఈ డాక్టర్ దగ్గరకి చాలామంది పేషెంట్స్ వచ్చేవారు. ఆ మల్టీ స్పెషాలిటీస్ హాస్పిటల్‌లో, అతని నవ్వు చాలా బావుంటుంది. కొత్తగా వస్తున్న హీరోల్లా వుంటాడు. చాలా ఫార్మల్‌గా డ్రెస్ అప్ అవుతాడు.

ఇంటర్ కమ్ లో "ఓసారి లోపలికి రండి మిస్.." అన్నాడు.

"రుషేంద్రమణి."

అవతలనుండి నిశ్శబ్దం. "ప్లీజ్ కమ్" అతను ఫోన్ పెట్టేసాడు. ఆ పేరు విని, నాగురించి ఏం అనుకున్నాడో అని నాకు టెన్షన్.

నేను లోపలికి వెళ్ళేసరికి, అతను పేషెంట్‌ని చూస్తున్నాడు. "చూడండి మిస్.. రుషీ....మణీ!" నేను చూస్తున్నాను.

"నేను న్యూరో సర్జెన్‌ని. ఇతను చూడాల్సింది నన్ను కాదు. జనరల్ ఫిజీషియన్‌ని. అతనికి అజీర్తి. నిన్నరాత్రి ఎక్కడో బఫేలో అర్ధరాత్రి తినకూడనివి అన్నీ తిన్నాడుట" చిన్న చిరాకు కనిపించింది ప్రబంధ్ మొహంలో. నేను "ఆయన నరాలు అన్నీ మెలిపెట్టేస్తున్నాయి అంటేనూ.." అని ఆగి "సారీ" అన్నాను.

"నరాలు శరీరం అంతా వుంటాయి, ఎక్కడైనా లాగొచ్చు. ఎక్కడో అతని బాధేంటో మీరు తెలుసుకోవాలి. యూ నీడ్ సమ్ నాలెడ్జి మరకతమణీ."

ఆ చివరిమాట నన్ను బాధించింది. అంతలోనే పేరు మర్చిపోవాలా?" రుషేంద్రమణి" అన్నాను.

పేషెంట్ కడుపు పట్టుకుని లేవలేక అవస్తపడ్తున్నాడు, "హెల్ప్ హిమ్.. హాస్పిటల్‌లో వర్క్ చేసేటప్పుడు, చాలా దయా కన్‌సర్న్ వుండాలి.." అన్నాడు ఇంగ్లీష్‌లో ప్రబంధ్.

ఇలా పేషెంట్స్‌ని చెయ్యి పట్టి లేపడానికి నేనేమైనా నర్స్‌నా? అని అడగాలనిపించింది. అయినా హెల్ప్ చేసి తీసుకెళ్ళాను.

నేను మిగతా పేషెంట్స్‌కి టోకెన్స్ ఇచ్చి, నెంబర్స్ పిలుస్తుండగా మళ్ళీ ప్రబంధ్ ఇంటర్‌కమ్ మోగింది "మిస్ మరకత.. సారీ మణీ"

నేను "డాక్టర్ కమింగ్" అంటూ హడావిడిగా లోపలికి వెళ్ళాను.

"మళ్ళీ రాంగ్ పేషెంట్, ఇతన్ని ఆంకాలజిస్ట్ డాక్టర్ జీవన్ దగ్గరకి పంపండి."

ఆ పేషెంట్ తలలోంచి వెన్నులోకి నొప్పి అన్నాడు" అతనికి స్పాండిలైటిస్ అనుకుని.."

"మీరు కాదు అనుకోవలసింది. సెండ్ హిమ్" ఈసారి ఆ సమ్మోహనమైన చిరునవ్వు లేదు. గంభీరంగా వుంది ఫేస్.

నేను పోయిన సారి చెప్పిన విషయం గుర్తుచేసుకుని ఆ పెద్దాయనని చెయ్యి పట్టుకుని, భుజం మీద చేయివేసి, ఇంప్రెషన్ కొట్టెయ్యడానికి జాగ్రత్తగా తీసుకెళ్తుంటే, "టెల్ డా జీవన్ దట్ హీ ఈజ్ ఏన్ ఎయిడ్స్ పేషెంట్" అన్నాడు ప్రబంధ్.

నేను టక్కున వదిలేస్తే బావుండదని, భయంగా చూసాను. తర్వాత నెమ్మదిగా వదిలేసి, డోర్ తీసాను. ప్రబంధ్ పెదవుల మీదకి చిరునవ్వు వచ్చినట్లు కనిపించింది.

నేను వెళ్ళి డెట్టాల్‌తో చెయ్యి కడుక్కుంటూ ఎయిడ్స్ ఎవేర్‌నెస్ కాంపెయినింగ్ మానేస్తే, ఎవరికీ రావట్లేదేమో అనుకున్నాను. కానీ దానికి అంత ప్రాముఖ్యత ఇవ్వడం లేదు అంతే అనుకున్నాను.

మొదటి రోజే అన్నీ బాడ్ ఎక్స్‌పీరియెన్సెస్ అవుతున్నాయి. కొంతమంది పేషెంట్స్ దస్త్రాలు దస్త్రాలు పాత డాక్టర్స్ దగ్గరకి వెళ్ళిన డయాగ్నోసిస్  రిపోర్ట్స్ తెస్తారు.  కొంతమంది చేతులూపుకుంటూ వచ్చి రోగమేమిటో చెపితే నేను తప్పుగా అర్ధం చేసుకుంటాను.

"కళ్ళు సరిగా కనిపించడంలేదు" అంటారు. నేను ఆప్తమాలజిస్ట్ దగ్గరకి పంపిస్తే, ఆయన "ఇతనిని న్యూరో సర్జన్ దగ్గరకి పంపండి" అని ఫోన్ చేస్తాడు. లేడీస్ కడుపు నొప్పి అనగానే  నేను గైనకాలజిస్ట్ దగ్గరకి పంపిస్తే, ఈవిడ్ని గ్యాస్ట్రియో ఎన్‌టీరియాలజిస్ట్ డాక్టర్ సుదర్శన్ దగ్గరకి పంపండి" అని ఫోన్ వస్తుంది.

అసలు ఇలా కాదు, ముందు మెడిసెన్ చదివి  ఆ తర్వాత ఈ రిసెప్షెనిస్ట్ ఉద్యోగం రావాలి అని మూడో రోజుకి ఓ తీర్మానానికి వచ్చాను.

మళ్ళీ ప్రబంధ్ ఇంటర్‌కమ్‌లో "ప్లీజ్ కమిన్ అంటుండగా "మై నేమ్ ఈజ్ రిషీ.. కమింగ్ డాక్టర్" అని లోపలికి వెళ్ళాను.

అక్కడ పేషెంట్స్ ఎవరూ లేరు.

"కాఫీ ప్లీజ్.. బ్లాక్ కాఫీ. నో షుగర్" అన్నాడు.

నాకు తల తిరిగిపోయింది. గుండమ్మకథలో సరోజలా "అమ్మా కాఫీ అనకపోతే కలుపుకోరాదూ?" అని అమ్మ రోజూ అంటుంది .నేను నాకాఫీనే నేను కలుపుకోను. ఈ డాక్టర్ నన్ను నిజంగానే ఫ్యాన్‌గా చూస్తున్నాడా? అని.

'డాక్టర్.." అన్నాను.అర్ధం కానట్లు.

"నా పర్సనల్ ఎటెండెంట్ నారాయణగారు రాలేదు,  ప్లీజ్ సెండ్ సమ్ కాఫీ ఇంద్రనీలామణీ" అన్నాడు.

"డాక్టర్.. రుష్యేంద్రమణి" కొంచెం కోపంగా చెప్పాను. "సారీ" అన్నాడు.

ఇరిటేషన్‌తో కాఫీ మిషన్ దగ్గరకి వెళ్ళి కాఫీ డికాషన్ పోసి గ్లాస్‌లో తీసుకెళ్ళాను.

"నీ చేతి కాఫీ తాగే అదృష్టం ఎప్పుడే అమ్మడూ? కాస్త కాఫీ చెయ్యడం అయినా నేర్చుకోవే, పెళ్ళి కావలసిన పిల్లవి" అనే బామ్మ మాట గుర్తొచ్చి, గుర్రుమన్నాను.

ప్రబంధ్ నేను కాఫీ తీసుకెళ్ళే సమయానికి ఎవరో తెల్లటి మలయాళీ నర్స్ పిల్లతో మాట్లాడుతున్నాడు. "లూసీ ఎవడే?" అంటూ.

ఈయన సకళా భాషా కోవిదుడు అనుకుంట. నేను కాఫీ గ్లాస్ టేబుల్ మీద పెట్టి వచ్చేస్తుంటే "రూపమణీ ప్లీజ్ వెయిట్" అన్నాడు.

"సర్ రిషీ.. కాల్ మీ రిషీ" అన్నాను.

"ఓ.కే నర్స్ యూ కెన్‌గో" అని నా వైపు తిరిగి "నేను మీకు కొన్ని టిప్స్ చెప్తాను, హిస్టరీ తీసుకు రాని పేషెంట్స్‌ని కరెక్ట్ డాక్టర్ దగ్గరకి ఎలా పంపాలో కూర్చోండి" అన్నాడు.

నేను కూర్చున్నాను. అదే నేను చేసిన తప్పు అందమైన వాళ్ళముందు ఎక్కువ సేపు కూర్చోకూడదు. ఏదో ఎట్రాక్షన్ ఏర్పడి, అది చనువుగా ఆ తర్వాత కాంక్షకొద్దీ ప్రేమగా రూపాంతరం చెందుతుంది.

ప్రబంధ్ కాయితం మీద బొమ్మలేస్తూ, ఏ పార్ట్ గురించి పేషెంట్ చెప్తున్నాడో.. ఆ తత్ సంబంధితరోగాలూ, వాటిని నయం చెయ్యడానికి స్పెషలైజేషన్ చేసిన డాక్టర్స్, ఈ హాస్పిటల్‌లో పని చేస్తున్న వారి పేర్లూ మూడు కాలమ్స్ గా విభజించి నాకు ఎక్స్‌ప్లైన్ చేసాడు.

తర్వాత "సంధ్యే డియర్?" అని నవ్వి ఆ పేపర్ నాలుగు మడతలు వేసి నా చేతికిస్తూ "ఇలా ఏ అబ్బాయి అయినాలెటర్ ఇచ్చాడా? నేనే మొదట ఇస్తున్నానా?" అన్నాడు.

"డియర్" అన్నమాట దగ్గర నా మనసు ఆలోచించడం మొదలయింది. మెదడు ఆలోచించడం మానేసింది.

నవ్వి "కాఫీ తీసుకురానా?" చనువుగా అడిగాను.

చల్లగా అయిపోయిన కాఫీని చూసి, "ప్లీజ్ డియర్" అన్నాడు.

"డియర్" ఆ మాటకి మనసు మళ్ళీ స్పందించింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS